క్లుప్తంగా

రూ.1.9 కోట్లతో ఫ్లైఓవర్ జంక్షన్ అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ, డీఈ సుబ్బారావు

కాకినాడ: నిర్మాణం పూర్తి చేసుకున్న ముత్తా గోపాలకృష్ణ వారధికి సంబంధించి శారదా దేవి ఆలయం వైపు ప్రతిపాదించిన జంక్షన్ అభివృద్ధి పనులను కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, డీఈ బి.సుబ్బారావు పనుల పురోగతిపై చర్చించారు. ఫ్లై ఓవర్ వినియోగంలోకి వస్తే పెరిగే ట్రాఫిక్ ఒత్తిడి దృష్ట్యా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. రూ1.9 కోట్లతో రహదారి విస్తరణ, కల్వర్టుల నిర్మాణం, ట్రాఫిక్ ఐలాండ్ తదితర పనులు చేపట్టినట్లు డీఈ సుబ్బారావు చెప్పారు. నెలాఖరు లోపు పనులన్నీ పూర్తవుతాయని ఆయన వివరించారు.

ఆరోగ్య సేవలు అందరికీ అందాలి

కాకినాడ రూరల్: ఆరోగ్య సేవలు అందరికీ అందాలని డాక్టర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా ఆరోగ్య సంరక్షణ అందించడంలో నెలకొన్న అసమానతలను తొలగించడమే లక్ష్యంగా 2017 డిసెంబరు 12 నుంచి ఏటా ప్రపంచ సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. ఆరోగ్య శ్రీ, ఫ్యామిలి డాక్టరు వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ పేదలకు ఆరోగ్య భద్రత కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలలపైనే దేశ భవిత

కాకినాడ రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని, బాలలపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఊహ తెలియని వయసులో తప్పిపోయిన బాలలకు సరైన పర్యవేక్షణ లేకపోతే వారు నేరస్తులుగా, సంఘ విద్రోహ శక్తులుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఆడపిల్లలను వ్యభిచార గృహాల్లోకి తరలించడానికి కూడా కొందరు వ్యక్తులు పొంచి ఉన్నారన్నారు. బాలలను పనిలో చేర్చుకున్నా, భిక్షాటన చేయిస్తున్నా 100, 1098 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్

కరప: గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు తెలిపారు. మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న జరగాల్సిన ఈ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు తుపాన్ వల్ల వాయిదా వేసినట్టు తెలిపారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె.పాల్‌ప్రసాద్, సెక్రటరీ రెవరెండ్ ఆర్.ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం గురించి మాట్లాడవద్దు బాబూ

వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక



కాకినాడ రూరల్: సంక్షేమం గురించి మాట్లాడే నైతికత చంద్రబాబునాయుడుకు లేదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టరు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. 49వ డివిజన్ కొత్త గైగోలుపాడు తన నివాసంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 2014–19 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు హామీలను నెరవేర్చలేదన్నారు. డ్వాక్రా రుణ మాఫీ అవుతుందని మహిళలు, జాబు వస్తుందని నిరుద్యోగులు ఎదురు చూసి మోసపోయారన్నారు. ఇప్పుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రజలను సంక్షేమ పథకాలు పేరుతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆయనకు మాత్రం 2019లో తీర్పునే ప్రజలు ఇస్తారన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కరప: మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుగుదురు, వేములవాడ, జి.భావారం గ్రామాల్లో ఒక్కొక్కటి వంతున ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 16వ తేదీన సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైన వారికి 18న తెలియజేయడం జరుగుతుందన్నారు. 19న ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి, 20న నియామక ఉత్తర్వులు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

పటిష్టంగా ఓటర్ల జాబితా

ఈఆర్వో కిశోర్



ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులు వంటి ప్రక్రియకు ఈ నెల 9వ తేదీతో గడువు ముగిసిందని ఈఆర్వో, ఆర్డీవో ఈట్ల కిశోర్ వివరించారు. మంగళవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతుల రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్ అప్పారావు, కె.విజయ రామయ్య, టి.నాగేశ్వరరావు, ఎంఏ రామరాజు, రూరల్, కరప తహసీల్దార్లు మురార్జీ, పొన్నమండ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్లు సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక జాబితా రూపకల్పనకు చర్యలు

కాకినాడ రూరల్: బూత్ స్థాయి ఎన్నికల అధికారులతో ఈఆర్వో, ఆర్డీఓ ఈట్ల కిశోర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి సవరణలు మార్పులు చేర్పులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శక జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా సమాచారం అందిస్తున్నామని తెలిపారు. కావున పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ఓటర్ల జాబితాపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూరల్, కరప తహసీల్దార్లు మురార్జీ, శ్రీనివాసు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

1.07 లక్షల దరఖాస్తుల స్వీకరణ

ఈఆర్వో నాగ నరసింహారావు వెల్లడి



కాకినాడ : ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 భాగంగా ఇప్పటి వరకు ఫారం 6, 7, 8 ద్వారా 1,07,063 దరఖాస్తులు వచ్చాయని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 83,276 పరిష్కరించామన్నారు. 9,790 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించామని చెప్పారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. అత్యధికంగా లక్షకు పైగా దరఖాస్తుల స్వీకరణతో పాటు పరిష్కారంలో కూడా కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ సిటీ నియోజకవర్గం మెరుగైన స్థానంలో ఉందన్నారు. కేవలం 12 శాతం దరఖాస్తులు మాత్రమే పరిష్కరించాల్సి ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, నాన్ ట్రేస్డ్ ఓటర్లకు సంబంధించి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించిన నోటీసుల వివరాలు, మార్పులు చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని ఆయన నాయకులకు వివరించారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్, గదుల సాయిబాబా (టీడీపీ) అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు సీతాపతిరావు, మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు వరహాలయ్య పాల్గొన్నారు.

బీఎల్‌వోల పాత్ర కీలకం

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో బీఎల్వోల పాత్ర కీలకమని ఈఆర్ఓ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఏఈఆర్ఓలు, బీఎల్ఓలతో ఆయన సమీక్షించి ఫారం 6, 7, 8 దరఖాస్తుల ప్రగతిపై చర్చించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్వోలు సీతాపతి రావు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు 24న సూపర్ లగ్జరీ

ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్



కాకినాడ: అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 24వ తేదీన సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు ఏర్పాటు చేసినట్లు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. 24న కాకినాడలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం దర్శనం అనంతరం కంచి, శ్రీకాళహస్తి, క్షేత్రాలను చూపించి 27వ తేదీ రాత్రికి కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈ బస్సుకు ఒక్కో టికెట్ రూ.3100గా నిర్ణయించామన్నారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. టికెట్ల కోసం టి.బాలకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ 94928 33885, ఎంఆర్ఎల్ స్వామి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 73829 10869, బీవీఎస్ఎన్ రెడ్డి 73829 10778లను సంప్రదించాలని ఆయన సూచించారు.

దేవునికి, భక్తులకు వారధులు పాస్టర్లు

- సీఎం జగన్ గెలుపు కోసం ప్రార్థించండి
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: లోక రక్షకుడైన ఏసు ప్రభువుకు, భక్తులకు మధ్య వారధిలాంటి వారు పాస్టర్లని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ప్రభువు సందేశం వినిపిస్తూ, మానవ జన్మ ఎంత ఉత్కృష్టమైనదో తెలిపి ముందుకు నడిపిస్తున్న పాస్టర్లను ఆయన అభినందించారు. నడకుదురులో మంగళవారం మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి క్రైస్తవ, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమపాలన సాగిస్తున్న సీఎం జగన్ గురించి ప్రార్థనలు చేసి, ఆశీస్సులు అందజేయాలని ఆయన పాస్టర్లను కోరారు. క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి, అందరికీ పంచి, శుభాకాంక్షలు తెలిపారు. సాలొమోన్ మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ డాక్టర్ సాలొమోను దైవ సందేశం వినిపించారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు జెడ్పీటీసీ డాక్టర్ శామ్యూల్ సాగర్, ఏపీ కమిషనర్ ఆఫ్ ప్రింటింగ్, స్టేషనరీ డీఎం లక్ష్మీపురం మోహన్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ యాసలపు దుర్గాప్రసాద్, మాజీ ఎంపీటీసీ జవ్వాది సతీష్, మండల ఫెలోషిప్ నాయకులు ఎస్ఏ గాడ్విన్, జోషప్ బెన్ని, శీరం ఐజాక్, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిటీ పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ సిటీ పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్‌ను మంగళవారం జోసెఫ్‌బెన్ని చర్చిలో మంగళవారం నిర్వహించారు. అంతర్జాతీయ వర్తమానికులు ఎడ్వర్డ్ విలియం ముఖ్య అతిథిగా విచ్చేసి క్రిస్మస్ సందేశం అందించారు. ఈ వేడుకల్లో సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు కుటుంబాలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఎఫ్ అధ్యక్షుడిగా ఐజిక్



డాక్టర్ శీరం ఐజిక్

కాకినాడ సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ (సిపిఎఫ్) అధ్యక్షుడిగా శీరం ఐజిక్ ఎన్నికయ్యారు. స్థానిక రమణయ్యపేటలోని బెరాకా బ్లెస్సింగ్స్ చర్చిలో మంగళవారం సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నికను మంగళవారం సీపీఎఫ్ ముఖ్య సలహాదారుడు డాక్టర్ పీఎం హెన్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి అధ్యక్షునిగా డాక్టర్ శీరం ఐజిక్, కార్యదర్శిగా చప్పిడి శామ్యూల్ విక్టర్, కోశాధికారిగా కుర్రా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా మోజెస్ బ్రైన్హం, సహాయ కార్యదర్శిగా దడాల విల్సన్, సభ్యులుగా ఎం.జాషువా, అగస్టిన్, పి.విలియం ఎంపికైనట్లుగా హెన్రి ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని బిషప్ జోసఫ్‌బెన్ని, సామ్‌బెన్ని, సాల్మన్ థామస్, జాన్‌బెంజి, ఎండీ జానీ, జయదీప్‌లు అభినందించారు.

భ్రూణహత్యల నివారణపై ప్రత్యేక దృష్టి

- లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై నిఘా అవసరం
- అధికారులతో ఆర్డీవో కిశోర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యల నివారణతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్డీఓ ఈట్ల కిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ, శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణ పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 107 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గత నవంబర్ వరకు 46 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 146 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసినట్టు ఆర్డీవో తెలిపారు. పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో ఆదేశించారు. రెండు నెలలకు ఒకసారి నిర్వహించే డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీలోని ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్‌టీడీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్ పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800–425–3365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2024 జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవ్ గర్ల్ చైల్డ్ వార్మ్ నినాదంతో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, పెయింటింగ్, పోస్టర్ ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు ఆర్డీవో వివరించారు. ఈ సమావేశంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ప్రసన్న, పీడియాట్రిషియన్ డాక్టర్ ఎం.కీర్తిప్రియ, సీడీపీవోలు పాల్గొన్నారు.

చురుగ్గా పంట నష్టం నమోదు

- సబ్ డివిజన్ ఏడీఏ బాబూరావు
- 18వ తేదీ వరకు అంచనాల సర్వే



వేములవాడలో పడిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ బృందం

కరప: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పంటనష్ట నమోదు చేస్తున్నారు. పొలాల్లోకి వెళ్లి పడిపోయి, ముంపునకు గురైన పొలాలను పరిశీలించి, రైతుల వివరాలు, విస్తీర్ణం నమోదు చేస్తున్నారని సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు తెలిపారు. మండలం వేములవాడలో మంగళవారం ఏడీఏ రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలసి వరిచేను కోయకుండా పడిపోయి దెబ్బతిన్నవి, ముంపునకు గురైన పొలాలను పరిశీలించి, నమోదుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ 18వ తేదీ వరకు అంచనాల నమోదు జరుగుతుందన్నారు. సమాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలున్నా, నమోదు కాకపోయినా ఈనెల 18 నుంచి 22వ తేదీ లోపు వీఏఏకు తెలియజేయాలన్నారు. ఏమైనా మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే సరిదిద్ది తుది జాబితాను 26వ తేదీన కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ కోరారు. కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కమిడి శంకర్, మీసాల సూరిబాబు, ఆర్ఐ పి.మాచరావు, వీఏఏ అజయ్‌కుమార్, వీఆర్వో పలివెల ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాన్ అప్రూవల్స్ పది రోజుల్లో సమర్పించండి

- డీఆర్వో శ్రీధర్ రెడ్డి
- 2014 నుంచి ప్రభుత్వ శాఖల భవన నిర్మాణాలపై అధికారులకు ఆదేశం



జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీధర్‌రెడ్డి

కాకినాడ సిటీ: ప్రభుత్వ శాఖల్లో 2014 నుంచి నేటి వరకు జరిగిన నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్స్ వివరాలను 10 రోజుల్లో ఉప కార్మిక కమిషనర్‌కు అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖ నిత్తయం అన్ని శాఖలను సమన్వయం చేసుకొని సంబంధిత సమాచారం ఎప్పటికప్పుడు రప్పించుకుని డేటా బేస్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. జీవో 111, 112లను అనుసరించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏఏ నిర్మాణ పనులు జరుగుతున్నాయో ఆ నిర్మాణ పనులకు చెందిన కాంట్రాక్టర్ చెల్లించే సొమ్ములో ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షమ బోర్డుకి చెల్లించాలని డీఆర్వో ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, సహాయ కమిషనర్ కేశవరావు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్, ఏపీఐఐసీలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయండి

న్యూ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలనే తమ వాదనను ప్రభుత్వానికి తెలియజేయాలని మంగళవారం కాకినాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని వారం రోజులుగా కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టినట్టు కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వర రావు, చెక్కా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వీరభద్రరావు, లేడీస్ రిప్రజెంటీటీవ్ సునీతలతో పలువురు న్యాయవాదులు డీఆర్వో శ్రీధర్‌రెడ్డిని కలసి వివరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: స్థానిక భానుగుడి సమీపంలో భానులింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం కార్తిక దీపోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దీపోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు, ఈవో వి.శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సర్వతోముఖాభివృద్ధి

- జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీపీ శ్రీలక్ష్మి
- గురజనాపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

కరప: రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం గురజనాపల్లిలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్‌లో వారు మాట్లాడారు. అవినీతికి తావులేకుండా నవరత్న, ఇతర సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి మరింతగా జరగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. అందుకు ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించడం ద్వారా జగనన్నకు మద్దతు తెలపాలన్నారు. నోడల్ అధికారి, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం ద్వారా అందిస్తున్న వివిధ సేవలను, సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాస్ మాట్లాడుతూ డీబీటీ, నాన్ డీబీటీ, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంల ద్వారా గ్రామంలో రూ. 32.07 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తర్వాత గ్రామం కూడలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పబ్బినీడి పాపారావు, జొన్నలగడ్డ కృష్ణమూర్తి, పి.వీరబాబు, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ పేరుతో దందా

వైద్యుడు, రోగిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కాకినాడ క్రైం: నకిలీ సంస్థల పేర్లతో విజిటింగ్ కార్డులు సృష్టించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఓ ఆక్యుపంచర్ వైద్యుడు, అతనికి వద్దకు వైద్యానికి వచ్చిన రోగి చేసిన కుట్రను పోలీసులు భగ్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే స్థానిక రమణయ్యపేటకు చెందిన ఆక్యుపంచర్ వైద్యుడు కల్యాణపు సురేష్, అతని వద్దకు రాజమహేంద్రవరం నుంచి వచ్చే రోగి కర్రి వెంకటరామిరెడ్డి సునాయాసంగా డబ్బు సంపాదించడానిక ఓ పథక రచన చేశారు. ఈ మేరకు వారు వరల్డ్ హ్యూమన్ రైట్స్ కమిషన్, నేషనల్ కంజ్యూమర్ రైట్స్, యాంటీ క్రైం బ్యూరో పేర్లతో విజిటింగ్ కార్డులు సృష్టించారు. అనంతరం వారు భానుగుడి కూడలిలోని అభిరుచి స్వీట్ షాప్‌లో స్క్వాడ్‌గా పరిచయం చేసుకుని తనిఖీలు చేశారు. వారిపై అనుమానం వచ్చిన దుకాణ యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో వారు విజిటింగ్ కార్డు యజమానికి ఇచ్చి డబ్బు కావాలని డిమాండ్ చేసి సిద్ధం చేసి ఉంచి ఫోన్ చేస్తే వచ్చి తీసుకుంటామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈలోగా పోలీసులు అక్కడికి చేరడంతో దుకాణ యజమాని వారికి అంతా వివరించారు. పోలీసుల సలహాతో, డబ్బు సిద్ధం చేశామని వచ్చి తీసుకోమని ఫోన్ చేశారు. వారు వచ్చీ రావడంతోనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అఖిల భారత కాంగ్రెస్ మహాసభపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

బాలాజీచెరువు: భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కాకినాడలో 1923 డిసెంబర్ 28న అఖిల భారత కాంగ్రెస్ మహా సభలు నిర్వహించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 28న శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించే సభల సందర్భంగా జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో వ్యాసరచన, దేశభక్తి గీతాలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. దేశ భక్తి గీతాలు,వక్తృత్వ పోటీలు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. వ్యాస రచన పోటీలకు ఆసక్తి గలవారు తమ వ్యాసాలను 22వ తేదిలోగా ఐడియల్ జూనియర్ కళాశాలకు అఖిలభారత కాంగ్రెస్ సభలు, వాటి విశిష్టిత రాసి అందజేయాలని కన్వీనర్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా మహాత్మగాంధీ మునిమనువడు గోపాలకృష్ణ గాంధీతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తామన్నారు.

కానిస్టేబుల్‌పై తేనెటీగల దాడి

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్‌పై తేనెటీగలు దాడి చేశాయి. కాకినాడ ట్రాఫిక్–1 పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కె.ఫణికృష్ణ మంగళవారం సాయంత్రం విధి నిర్వహణలో ఉండగా ఐడియల్ కళాశాల సమీపంలో తేనెటీగల దాడికి గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు అతడిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న అతడిని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి ఉన్నతాధికారులను కోరారు.